క్లుప్తంగా

భవిత కేంద్రం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి యాదయ్య బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆట పరికరాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సమీపంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, సౌకర్యాలను పరిశీలించారు. రుచికరమైన భోజనం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంఈవో శైలజ, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఐఐటీ, నీట్‌కు సంబంధించి పాఠశాల స్థాయి శిక్షణ అందించడానికి ఖాన్ అకాడమీ శిక్షణ తరగతులు ప్రారంభించిందని జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. రాజీవ్‌నగర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్లో బుధవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ప్రతీ విద్యార్థికి ఒక్క ఐడీ క్రియేట్ చేయాలని, టైం టేబుల్ తయారు చేసుకోవాలని సూచించారు. తరగతుల అభ్యర్థుల ఫలితాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చన్న, డీఆర్‌పీలు శ్రీనివాస్, వెంకట రమణ రెడ్డి, సతీష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



జ్వర బాధితులతో మాట్లాడుతున్న డాక్టర్ శివప్రసాద్

మంచిర్యాలటౌన్: దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందునా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శివప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జ్వరం వార్డును బుధవారం పరిశీలించి, ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అక్కడి రోగులకు, దోమలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ బాలికలు, బాలుర కళాశాల ఏర్పాటు చేయాలి



జీపు జాతాలో మాట్లాడుతున్న నాయకులు

చెన్నూర్: విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 18నుంచి 23వరకు చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ జీపు జాతా చెన్నూర్‌కు చేరింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ మాట్లాడుతూ.. చెన్నూర్‌లో ఎస్సీ బాలికల, బాలుర కళాశాలతో పాటు హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాత్మ జ్యోతిభాపూలే విగ్రహాలకు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, నాయకులు రాజ్‌కుమార్, సాయికిరణ్, ప్రతీక్, ప్రదీప్, పాల్గొన్నారు.

దీక్షకు మద్దతు



మద్దతు తెలుపుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జీవో నంబర్ 49ని రద్దు చేయాలని, పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు బుధవారం మంచిర్యాల బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీవో నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని, పోడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గం అశోక్, పట్టి వెంకటకృష్ణ, ఎనగందుల కృష్ణమూర్తి, బింగి ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

మూలమలుపు ప్రమాదకరం



భీమారం: మండల కేంద్రం నుంచి నెన్నెల ప్రధాన రోడ్డులో మాదన్నగూడెం వద్ద మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. దాదాపు 32 కిలోమీటర్లు ఉన్న ఈ ప్రధాన రహదారిలో భీమారంలోని మాదన్నగూడెం, కొత్తగూడెం, బూర్గుపల్లి, నర్సింగాపూర్, గొల్లవాగు ప్రాజెక్ట్ రోడ్డు వద్ద గల మూల మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి మూలమలుపులు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరకలేస్తున్న గోదావరి



చెన్నూర్/దండేపల్లి: ఎస్సారెస్పీలో ఇన్ ఫ్లో పెరగడంతో, ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని గోదావరినదిలోకి వదిలారు. దీంతో దండేపల్లి మండలంలోని గూడెం వద్ద, చెన్నూర్ వద్ద గోదావరి నది బుధవారం ఉరకలేస్తూ, పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. రెండు రోజులుగా నదిలో వరద ఉధృతి తీవ్రంగా పెరిగింది. నదీ ప్రాంతానికి ఎవరూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

కొత్తపల్లిలో నీటి కష్టాలు



తాండూర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగు రోజులవుతుండటంతో కొత్తపల్లి గ్రామంలో తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తింది. ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా సిబ్బంది ఇంటింటికి నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, నిత్యావసరాలకు సరిపోవడం లేదు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

తాండూర్: విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించబోమని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. రేచిని, గోపాల్ నగర్, తాండూర్ గ్రామ పంచాయతీలను, అంగన్‌వాడీ కేంద్రాలను, గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న తాండూర్ పంచాయతీ కార్యదర్శి దివాకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయించాలని, పరిశుభ్రమైన నీటిని గ్రామ ప్రజలకు అందించాలని, మల్టీపర్పస్ వర్కర్ల చేత ప్లాస్టిక్ సేకరణ చేయించాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం తాండూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సందర్శించి వార్డుల వారీగా ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మణ్, దివాకర్ ఉన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



సీసీసీ కార్నర్ వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్/జన్నారం/తాండూర్/లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టపర్చడానికి రాజీవ్‌గాంధీ చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. రామకృష్ణాపూర్, జన్నారం, తాండూర్ ఐబీ, లక్సెట్టిపేట, మందమర్రి, శ్రీరాంపూర్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణాపూర్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, శ్యాంగౌడ్, గాండ్ల సమ్మయ్య, బానేష్, గోపురాజం, జన్నారంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, తాండూర్ ఐబీలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బాణయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, మాసు వెంకటస్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విష్ణు, కల్యాణ్, టౌన్ ప్రెసిడెంట్ శ్రీధర్, లక్సెట్టిపేటలో మండల కాంగ్రెస్ నాయకులు చింత అశోక్, శ్రీనివాస్, ఎండీ ఆరీఫ్, మందమర్రిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, నాయకులు సుదర్శన్, లక్ష్మణ్, మహంతి అర్జున్, ఉదయ్, గట్ల సారంగపాణి, నస్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి నూకల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాలిద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ముందడుగు

- వాగులను పరిశీలించిన సింగరేణి అధికారులు



వాగును పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు

తాండూర్: నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో వర్షాలకు దెబ్బతిన్న బ్రిడ్జిల సమస్యలను పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం ముందడుగు వేసింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్‌ల నేతృత్వంలో మంగళవారం పలువురు నాయకులు సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డిని కలిసి బ్రిడ్జిల సమస్య తీవ్రతను వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. గోలేటీ ఏరియా వర్క్‌షాపు ఏజీఎం కృష్ణమూర్తి, ఎస్‌ఈ నరేష్, బీపీఏ ఓసీపీ-2 మేనేజర్ మహేష్‌లు బుధవారం భీమన్న వాగు, లచ్చుగూడెం వాగులను పరిశీలించారు. లచ్చుగూడెం వద్ద ఇనుప బ్రిడ్జిని త్వరితగతిన ఏర్పాటు చేసి, భీమన్న వాగులో భారీగా పేరుకుపోయిన పూడికను నీటి ప్రవాహం తగ్గగానే తొలగిస్తామని ఏజీఎం కృష్ణమూర్తి తెలిపారు. పూడిక తొలగిస్తే బ్రిడ్జి సమస్య ఉండబోదన్నారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగదీష్, గిరిజన నాయకులు పర్వత్‌రావు, మాణిక్‌రావు, భగవంత్‌రావు, గంగుపటేల్, అమృత్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్స్ తొలగింపు



కేబుల్ వైర్లు కట్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

శ్రీరాంపూర్: విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా కట్టిన కేబుల్ టీవీ, ఇంటర్నెట్ కేబుల్స్‌ను విద్యుత్ అధికారులు తొలగించారు. నస్పూర్ మండల విద్యుత్ శాఖ ఏఈ రామచందర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు విద్యుత్ స్తంభాలపై వైర్లను సిబ్బంది బుధవారం కట్ చేసి స్తంభాల పై నుంచి తొలగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా క్రమ పద్ధతిలో కేబుళ్లను కట్టుకుంటే అభ్యంతరం ఉండదన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ పాపాలాల్, లైన్ ఇన్స్‌పెక్టర్ ధరణి రమేష్, లైన్ మెన్, సతీష్, కోటేష్ పాల్గొన్నారు.

సమాచారం

శిక్షణ తరగతులు వాయిదా

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 23, 24నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నాగారజ్ తెలిపారు. ఈ నెల 30, 31న శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీఆర్యవర్త ఇన్‌ఫోటెక్ మంచిర్యాలలో ఎక్స్ ఎం ఎల్, ఈపీయూబీ 100 ప్రోగ్రాం మేనేజర్ పోస్టుల కోసం డిగ్రీ చదివి 18-30ఏళ్ల వయస్సు ఉన్న యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. నెలకు జీతం 8-10 వేలు ఉంటుందన్నారు. ఎంపికైన వారికి 30రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో, దండేపల్లి మండలంలోని గుడిరేవు, కొండాపూర్, నంబాల, నాగసముద్రం, రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ బోధకులుగా పనిచేసేందుకు కనీస ఇంటర్ ఉత్తీర్ణత ఉండి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు పోటు తిరుపతిరెడ్డి, చిన్నయ్య బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆయాగా పని చేసేందుకు 7వ తరగతి కనీస విద్యార్హత ఉన్న మహిళ నుంచి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తుండగా ఈ నెల 22లోగా దండేపల్లి ఎంఈవో కార్యాలయంలో, 23లోగా రాపల్లిలోని మండల విద్యా వనరుల కేంద్రంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.

‘108’ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



తనిఖీ నిర్వహిస్తున్న సామ్రాట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని ప్రజలు 108అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అన్నారు. హాజీపూర్ 108అంబులెన్స్ వాహనాన్ని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వాహనం పనితీరు, వైద్య పరికరాలు, అత్యవసర సమయంలో వినియోగించే మెడికల్ కిట్లు, ఉండాల్సిన మందులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా 108 అంబులెన్స్ ఎగ్జిక్యూటివ్ బి.సంపత్, ఈఎంటీ ఏ.రాంబాబు, పైలెట్ డి.నరేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

నెన్నెల: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (టీజీఆర్‌ఎఫ్) టెక్నికల్ మెంబర్ రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ లతావత్ కిషన్, జిల్లా ఎస్‌ఈ ఉత్తమ్‌జాడే అన్నారు. నెన్నెల రైతువేదికలో బుధవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని వారు మాట్లాడారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వినియోగదారుల ఫోరం దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ పంపిణీలో ఎదురయ్యే లోపాలను సత్వరం పరిష్కరించేందుకే పరిష్కార వేదికలు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గొల్లపలి డివిజనల్ ఇంజనీర్ బానోతు రాజన్న, అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ రవికుమార్, నెన్నెల విద్యుత్ ఏఈ రాజన్న, సబ్ ఇంజనీర్ పవన్, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలాల విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ‘పొలంబాట’

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలను సరిచేసి రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్‌లో ఏమైనా సమస్యలు ఉండే వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ గణేశ్, సిబ్బంది రవి, సతీష్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



చెన్నూర్: మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం/చెన్నూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, భీమారం ఎస్సై శ్వేత అన్నారు. గణేశ్ మండపాల నిర్వాహకులతో, కుల పెద్దలతో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల ఏర్పాటు కోసం ముందస్తుగా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులు పోలీసులు, విద్యుత్ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తొమ్మిది రోజుల పాటు మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యకలపాలకు తావివ్వకుండా భక్తి భావనతో ఉండాలన్నారు. సమావేశంలో సీఐ దేవేందర్‌రావు, ఎస్సై సుబ్బారావు, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, ఫైర్, మున్సిపల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జైపూర్/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. జైపూర్ పోలీస్ స్టేషన్లో బుధవారం గణేశ్ ఉత్సవాల నిర్వాహకులతో శాంతిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో కలిసి ఏసీపీ వెంకటేశ్వర్ మాట్లాడారు. పోలీస్‌శాఖ నుంచి అనుమతి పొందాలని, ఆన్‌లైన్ ద్వారా విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి సమాచారం అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సైలు శ్రీధర్, సంతోశ్, శ్వేత, తదితరులు పాల్గొన్నారు. బెల్లంపల్లి టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో బెల్లంపల్లి రూరల్ సీఐ చందవోలు హనోక్ అధ్యక్షతన శాంతి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై చిలుముల కిరణ్‌కుమార్, శాంతి కమిటీ సభ్యులు, స్థానికులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దండేపల్లిలో ఎస్సై తహసీనొద్దీన్ అధ్యక్షతన శాంతి సమావేశం నిర్వహించారు.

శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

మందమర్రిరూరల్/కోటపల్లి: వినాయకచవితి వేడుకలను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సీఐలు బన్సీలాల్, శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై రాజేందర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శాంతి కమిటీ సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో 21వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సీఐ ఆకుల అశోక్ హాజరవుతున్నారన్నారు. నిర్వాహకులు, యువకులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



లక్సెట్టిపేట: మండలంలోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగడిబజార్ నుంచి గాంధీచౌక్ వరకు కృష్ణ భగవానుడి విగ్రహంతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.

సంస్థ స్థితిగతులపై అవగాహన ఉండాలి

- శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సంస్థ స్థితిగతులు, భవిష్యత్ సవాళ్లపై ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. నస్పూర్ కాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద బుధవారం సివిల్ డిపార్టుమెంట్ ఉద్యోగులకు, సెక్యూరిటీ డిపార్టుమెంట్ ఉద్యోగులకు మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో సివిల్, సెక్యూరిటీ విభాగాలు ఎంతో కీలకమైనవన్నారు. సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతీ ఉద్యోగి తన పనితీరును మెరుగుపర్చుకొని సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

‘బీఆర్‌ఎస్-బీజేపీ రెండూ ఒక్కటే’

జైపూర్: పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులే, ఇప్పుడు రైతులకు అన్యాయం జరుగుతుందని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి యూరియా రాకుండా కేంద్రం అడ్డుపడుతుండగా దానిపై బీఆర్‌ఎస్ నాయకులు ఎవరూ మాట్లాడడం లేదని బీఆర్‌ఎస్-బీజేపీలు రెండు ఒక్కటేనని ఆరోపించారు. జైపూర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని బీఆర్‌ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని వాపోయారు. అనంతరం రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు శీలం వెంకటేశ్, ఆసంపల్లి శ్రీకాంత్, తిరుపతిరాజు, రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

చెన్నూర్: ప్రభుత్వ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకూర్తి శ్రీనివాస్, గోపాల్ అన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్కాలర్‌షిప్‌ల పై ఆధారపడి విద్యాభ్యాసం చేస్తున్న నిరుపేద విద్యార్థులు, విద్యను మానుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

‘ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన’

పాతమంచిర్యాల: చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎల్‌ఐసీ ఏజెంట్ల డిమాండ్లను యాజమాన్యం అంగీకరించి, ఆమోదించి అమలు చేయాలని ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు గాదాసు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏజెంట్ల సంఘం డివిజన్ నాయకులు రాజబాబురెడ్డి, బ్రాంచీ నాయకులు తిరుపతి, కుమారస్వామి, సుధాకర్, లక్ష్మినారాయణ, ఆశీర్వీలన్స్ ఆల్ ఇండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఆర్ రాజేశం, తిరుపతిరెడ్డి, చరణ్‌కుమార్ పాల్గొన్నారు.